21. అభిరుచులు

"ఎక్కడికి వెళ్ళావ్?" అన్నాడు దాసు.

"ఇవ్వాళ శ్యామలవొచ్చింది.. చూసేందుకు వెళ్ళాను" అన్నది చెల్లెలు సుశీల.

ఒక్క నిమిషం నిలబడ్డచోటనే ముఖం దించేసి తరువాత అప్పుడే తన స్థితిని చప్పున గ్రహించినట్టు– "సరే అన్నం పెట్టు–" అని తన గదిలోకి వెళ్ళాడు దాసు.

శ్యామల మాట విన్నప్పట్నుంచీ అడుగునపడ్డ ఆలోచనలన్నీ దాసులో పనిచెయ్యసాగినై. తనూ, సుశీలా, శ్యామలా చిన్నతనం నుంచీ ఒకేచోట ఆడుకుంటూ గడిపిన రోజులు మొదలూ శ్యామలా తనూ వివాహమాడి తాము సుఖించబొయ్యే రోజుల్ని గూర్చి ఒకరినొకరు జ్ఞాపకం చేసుకోవటం వరకూ జరిగినదంతా ఒక్కసారి అతనికి జ్ఞాపకం వొచ్చింది. తామిద్దరూ ప్రేమించుకున్నట్టు రెండు కుటుంబాలకూ తెలుసు. తనకూ శ్యామలకూ వివాహం జరిగి తీరవలసి ఉంటుందని కూడా అపోహపడ్డాడు. ఆ పెళ్ళి మాటలు కూడా రెండు కుటుంబాల మధ్యా జరిగి ఉండటం వల్ల తను అమిత ధైర్యంతో ఉండి, ఇక ఆ విషయంలో అసలు అనుమానానికే చోటులేదన్నట్టు అది చాలా మామూలు విషయమైపోయింది. తరువాత, తను చదువుకు పట్నం వెళ్ళిపోవటమూ, తను మళ్ళీ తిరిగి వచ్చేప్పటికల్లా శ్యామల పెళ్లయి అత్తవారింటికి వెళ్లటమూకూడా జరిగిపోయినై.

శ్యామల అత్తవారింటి పరిస్థితులు తెలుసుకున్నాక తను ఆమెకు తగిన వరుడు కాదేమోననిపించింది. ఆమెకు అంతమంచి సంబంధం వొస్తే తనెలా అడ్డుపడగలడు? అదీకాక ఆ వివాహం తన పరోక్షంలో జరిగిపోయింది. అంతా ఐపొయ్యాక ఆ విషయం

మీద చర్చకూడా అనవసరమనిపించింది. అందుకని, శ్యామల విషయంలో అతను కుంగిపోలేదు. మెల్లిగా తను శ్యామలను జ్ఞాపకం చేసుకొని బాధపడకుండా రోజులు గడపటం అలవాటు చేసుకున్నాడు.

మళ్ళీ రెండు సంవత్సరాలకుగాను శ్యామల పుట్టింటికి వొచ్చింది. ఆమెలో చాలామార్పులు ఉండి ఉండవచ్చు. ఆమెను చూద్దామనే ఆతృత దాసులో కలిగింది కాని– తను ఆ పరాయి పిల్లకోసం ఇంతగా మధనపడటం పైవాళ్లకేమీ నచ్చదు. అసలు ఆ విషయం తనకే నచ్చలేదు. తనను తలుచుకోకుండానే ఆమెకూడా రోజులు గడపటాన్ని అలవర్చుకొనే ఉంటుందేమో?

ఆ రాత్రి భోంచేసి కిటికీలో లాంతరు పెట్టి చదువుకుంటున్నాడు. తండ్రి మామూలుగా పురాణ కాలక్షేపానికి వెళ్ళాడు. చెల్లెలు సినిమాకుపోయింది.

"సుశీలా!"

దాసు కదలకుండానే అసలు ఆ గొంతు ఎవరిదై వుంటుందోనని కూడా ఆలోచించకుండానే "లే..దు" అని జవాబు చెప్పాడు.

రెండుమూడు నిమిషాలయ్యాక, నరవాసనపట్టిన పులిలాగా చప్పున పుస్తకం దించేశాడు. గది గుమ్మంలో నేలచూపులుచూస్తూ శ్యామల నిలబడివుంది... శ్యామల! ఎంత మారిపోయింది! ఎంత బాగా ఎదిగింది! అనుభవించబడుతూన్న కొద్దీ పైకి ఉబికిన ఆమె యవ్వనమూ, సంసారస్త్రీలో క్రమంగా ఏర్పడే శాంతమూ, ఆమెను తను ఇప్పుడే చూస్తూన్నట్టుగా భ్రమపడేట్టు చేసినయ్.

"నువ్వా – కూర్చో......" అన్నాడు.

ఆమె సిగ్గుపడుతూనే కూర్చుంది.

"సుశీల లేదు...... సినిమాకు వెళ్ళింది –"

"నాకు తెలుసు–" గొంతులో ఎంత మార్దవం వొచ్చింది!

శ్యామల తనను చూసిపొయ్యేందుకు వొచ్చింది కాబోలు! విధి అనుకూలించకపోయినా, తనకింకా ఆమె హృదయంలో స్థానంవుంది కాబోలు!

"నీకు మీ అత్తారింట్లో బాగా జరుగుతోందా?" అన్నాడు, ఆమె క్షేమాన్ని విచారించాల్సిన బాధ్యతను గుర్తించి.

"వాళ్లు లక్షాధికార్లు –" ఆమె గొంతులో మాత్రం ఆ 'లక్షలు' ప్రసాదించే గర్వం కనిపించలేదు.

"మీ ఆయన మంచివాడేనా?"

ఆమె సిగ్గుపడుతూ వొంచిన తలనే "ఊఁ" అన్నట్టు వూపింది.

"అదృష్టవంతురాలివి !"

"నువ్వు పెళ్ళిచేసుకోలేదేం?" అంది శ్యామల, తన వొంతు వొచ్చిందని.

"నాకు నచ్చిన పిల్ల దొరకలేదు."

"ఇంకానయం ! లోకంలో ఆడపిల్లలే లేరని అనలేదు- నచ్చటమంటే?" దాసు కొంటెగా నవ్వి అన్నాడు. "నీలాగుండాలి-"

శ్యామల మాట్లాడకుండా నిట్టూర్చింది. ముఖం చీకటివైపుకు తిప్పి ఉండటంవల్ల ఆ ముఖంలోని భావమైతే తెలియలేదు.

కాస్త ఆగి శ్యామల అంది. "ఉద్యోగమన్నా సంపాదించలేక పొయ్యావా?"

"ఎవరున్నారనీ! భార్యవుంది కనకనా- డబ్బు కావాలని గోల చేసేందుకు?"

"ఇంత తిరుగుడుగా మాట్లాడుతావేం? ముందు భార్యనన్నా ఉద్యోగమన్నా, లేక రెండూ ఒక్కసారేనన్నా చూసుకోవాలిగాని-"

"రెండూ-బజార్లో దుకాణాల్లో దొరికే వస్తువులు కావుగా!"

శ్యామల నవ్వి ఊరుకుంది.

"నీ చదువు ఐపోయిందిగా- ఇంకా ఏమిటీ చదువుతున్నావ్?" అని దాసుకు దగ్గరగా జరిగి, పుస్తకానికి దగ్గరగా ముఖం ఆనించి, ఆ భాష తనకు రాకపోయినా ఎగాదిగా చూడసాగింది.

"అది కాలేజీ చదువు, ఇది లోకజ్ఞానానికి సంబంధించింది...... అక్కడ చెప్పని సమస్యలు-"

"ఏం సమస్యలూ?" అంది శ్యామల.

నవ్వాడు. "స్త్రీ సమస్య-"

'స్త్రీకూడా సమస్యేనా?" అన్నట్టు చూసి, "కొంటె మాటలు" అని దాసు బుగ్గ గిల్లింది. కాని దాసు చలించలేదు. శ్యామల అంత దగ్గరగా నిలబడేప్పటికి అతని శక్తులే పనిచెయ్యటం మానేసినయ్.

"చాలా నగలు చేయించావే?" అన్నాడు.

'నీకు కనిపించినవల్లా చేయించిన నగలేనా?' అన్నట్టు వెగటుగా నవ్వింది.

'నువ్వు చాలా బాగున్నావే!' అన్నట్టయితే ఆమె బాగా ఆనందించి ఉండేది.

పడకకుర్చీ చేతిమీద విలాసంగా కూర్చొని, ఎడం భుజం మించి వాలుజడ జార్చి, దాసు ముఖంలోకీ, నేలమీదికీ చూపులు మార్చుకుంటూ, ఏదో చెప్పబోయి ఊరుకుంటూన్నట్టుగా వ్యక్తపరచసాగింది - శ్యామల.

"నిద్రరావటంలా?" అన్నాడు దాసు. స్త్రీ సమస్యల్ని చదివే దాసు ఇలాటి ప్రశ్నను స్త్రీ ఐన తనకు వెయ్యటం వల్ల–అసలతనికి స్త్రీ సమస్య అనే మాటకైనా అర్థం తెలిసివుంటుందని తను అనుకోవటం చాలా పొరపాటు!

"ఆ సమస్యకూడా ఆ పుస్తకంలో వుంటుందా?"

"ఏమో–నేను ఇంకా అంతవరకు రాలేదు."

"ఔను.....భార్య వుండి, ఆమె వియోగం ఉంటేగా?"

"ఇంకా అనుభవం లేదు కదా?" అని నవ్వి అన్నాడు. "శ్యామా ! పొద్దుపోతుంది... ఇంటికి వెళ్ళరాదూ? ఎవరైనా చూస్తే?–"

"చూడనీ–భయమేముందీ? నేను నీకోసం వచ్చినప్పుడు– ఆ మాట చెప్పేందుకు భయపడటం దేనికీ?"

దాసుకు ఇప్పటికికాని శ్యామల వొచ్చినపని దృఢంగా అర్థం కాలేదు. ఆమెలో ఇంతధైర్యం ఉందని కూడా తను అనుకోలేదు.

"అదేమిటి శ్యామా!– తప్పు...."

"నాకు తెలుసులెద్దూ" –

ఎంత తేలిగ్గా మాట్లాడింది!

"నేను వొచ్చి దిగపెట్టేదా?"

"ఇక్కడే నన్ను నిద్రపుచ్చు–" అని తన రెండు చేతుల్నీ దాసు మెడ చుట్టూవేసి, అతని ముఖంలోకి చూడసాగింది.

దాసుకు ఆశ్చర్యమూ, భయమూ, సానుభూతీ, జాలీ– ఇంకా అనేక ఫీలింగ్స్ కలిగినయ్. రెండు నిమిషాల దాకా అతను – తను 'దాసు' ను అనే మాటే మరిచిపొయ్యాడు.

ఆమె అతని భార్యయితే ఏమైఉండేదో కాని– యీ క్షణంలో మాత్రం అతను శక్తిహీనుడయ్యాడు. ఇది పురాణాల్లో బోధించిన పాపమనీ కాదు, శ్యామలలాంటి సుందరితో యీ వెన్నెట్లో దొరికిన ఒక్క రాత్రినీ వొదులు కోవటం తనకు అయిష్టమనీ కాదు, శ్యామల ఉద్రేకానికి తను జవాబు చెప్పలేని అసమర్థతా కాదు. మరి ఏ ఇతర కారణమో కాని ఆమె చేతుల్ని మెల్లిగా విడదీస్తూ, "శ్యామా! ఇది మంచిపని కాదు" అన్నాడు మెల్లిగా.

ఆమె ఇంకా నవ్వుతూనే అంది: "నీతులు చెప్పించుకునేందుకు నేను ఇక్కడికి వొచ్చాననుకున్నావా?"

దాసుకు సారంగధరుని అవస్థ సరిగా అర్థమైంది. ఏ మాటలు చెప్పి ఆమెను వొదిలించుకోవాలో అతనికి అర్థంకాలేదు.

"సుశి సినిమానుంచి వొస్తుంది-"

"రానీ. నేనేమన్నా కొత్తదాన్నా? ... ఎంత నంగనాచిగా మాట్లాడటం నేర్చుకున్నావ్?"

శ్యామకు తనపైన గల అభిమానమూ, ప్రేమా తనకు అర్థంకాకపోలేదు. ఆమె తనకు భార్యగా జీవితాంతం వరకూ ఉండే అవకాశం పోయినా- తన హృదయాన్ని విప్పి చెప్పుకునేందుకు యీ సంఘాన్నీ, నీతుల్నీ తన కోసం జవదాటి వొచ్చింది. తనింకా వైరాగ్యం కూడా పుచ్చుకోలేదు. ఆమె అందాన్ని మెచ్చుకుంటూన్న తను ఇంకొక్క కారణం వల్ల ముందుకుసాగే అవకాశాన్ని తప్పనిసరిగా వొదులుకోవాల్సి వొచ్చింది.

"శ్యామా! నా మాట విను.. నువ్వు మర్యాదగల సంసార స్త్రీవి. నీ మర్యాదకూడా నువ్వు కాపాడుకో లేకపోతే-"

తాను చూపే నిరుత్సాహం ఇప్పటికికాని శ్యామలకు అర్థంకాలేదు. తనంత తానైవొస్తే ఎంత చులకన! ప్రవరుడి చేత తిరస్కరించబడ్డ వరూధిని ఎలా బాధపడిందో ఇప్పుడే శ్యామలకు అర్థ మవసాగింది. దాసు వింత ప్రవర్తను తను ఎలా అర్థంచేసుకోవటం?... తనను ప్రేమించటం లేదని దాసు నోటివెంటనే విన్నా తను నమ్మటం అసంభవం! "ఇలా మారిపోతా వనుకోలేదు-" అంది.

ఆమె కళ్ళు చమ్మగిలినయ్. 'ఓటమి'తో ఆమె శరీరం ఒణికింది. ఒక్క క్షణం దాసును మింగేద్దామన్నంత కోపం ఆమెను ఆవరించింది. కాని ఆమె ఆశల్తోపాటు, బలమంతా ఇప్పుడే మాయమైనట్టు తోచింది.

"శ్యామా! నన్ను కారణాలేమీ అడగొద్దు... ఇంక ఇంటికి వెళ్లు" అన్నాడు దాసు, నేల చూపులు చూస్తూ.

ఆమె అవమానంతో కుంగిపోతూ, దుఃఖం పొంగే కంఠంతో మాట్లాడబోయి గిర్రున వెనక్కు తిరిగి కోపాన్ని సూచించేందుకు నేలనుతంతూ చరచరా వెళ్ళిపోయింది.

దాసు నిట్టూర్చాడు.

2

ఆరునెలలు గడిచాక శ్యామల మళ్ళీ పుట్టింటికి వొచ్చింది. ఆమెలోని పరాభవాగ్ని చాలావరకు చల్లారింది. దాసు యోగక్షేమాలు కనుక్కోవటంలో ఆమె ఎప్పటిలాగే అశ్రద్ధ చూపలేదు.

తమ ఇంటి దాసీవల్ల దాసు అంతరంగిక జీవితం చాలావరకు తెలిసింది. అది తలుచుకొని ఆమె కోపంతో ఒణికిపోయింది.

మధ్యాహ్నం దాసును చూడబోయింది. సుశీల అత్తవారింటికి వెళ్ళింది. దాసు తండ్రి ముసలితనం మీరుతూన్నకొద్దీ పురాణాలమీద ఆపేక్షను పెంచుకుంటూనే ఉన్నాడు. దాసుమాత్రం రోగిష్టి మంచంలో పడుకొని చదువుకుంటున్నాడు. శ్యామల వొచ్చి, గది వాకిటిలో నిలబడి తను వొచ్చినట్టు సూచించేందుకు సన్నగా దగ్గింది.

దాసు తలెత్తి చూసి, లేచి కూర్చొని నవ్వుతూ ఆమెను ఆహ్వానించాడు; "రా శ్యామా! ఎప్పుడొచ్చావ్? కులాసాగా ఉన్నావా! ఆ కుర్చీలో కూర్చో.." అసలు ఆరు నెల్లక్రితం తమ మధ్య ఏమీ జరగనట్టుగానే ఆ గొంతు సాక్ష్యం ఇస్తోంది. ఇది చూసేప్పటికి శ్యామల ఆశ్చర్యపోయింది. తనతో మళ్ళీ పోట్లాడినట్టయితే ఆమెకు బాగుండేది! ఏమైనా తన ఒక్క ప్రశ్నకు మాత్రం సమాధానం తేల్చుకోవాలని యీసారి వొచ్చింది.

శ్యామల తన ఉద్రేకాన్ని బలవంతాన ఆపుకుంటూ కూర్చొని మెల్లిగా మొదలు పెట్టింది. "ఇలా ఐపోతావనుకోలేదు.... ఇంత చదువుకున్నవాడివి; పెళ్ళి చేసుకోకుండా, ఉద్యోగమన్నా సంపాయించకుండా–"

"అది మామూలేగా!" అన్నాడు దాసు.

"ఎన్నాళ్ళూ?... పోనీ వాటి కోసం ఎవరేడ్చారు?... ఇంతలో నీ శీలాన్ని ఇలా బజారుముండలకు అప్పగిస్తావనుకోలేదు..."

దాసు 'నీ దాకా వొచ్చిందా?' అన్నట్టుచూసి, 'ప్చ్' అని ఊరుకున్నాడు.

"అన్నపూర్ణ తప్ప నీ అందానికి లోకంలో ఇంకో ఆడదే దొరకలేదా? ఆ దాసీముండకన్న– నీ రుచులు ఇంత కిందికి వొస్తయ్యనుకోలేదు. ఆ మాట విన్నప్పుడు నాకే సిగ్గేసింది–"

"పోనీ కాని–" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆమె ఇక అతని మాటను వినిపించుకోదల్చలేదు. ఆమె కోపం ఆమె స్వాధీనం తప్పింది. చప్పున కాలితో శబ్దంచేసి నిలబడి అంది: "నాకు అర్థంకాకుండా వుంది; నువ్వు యీ నీచజాతి స్త్రీలవల్ల శరీరం కూడా పాడుచేసుకున్నావ్. అది నీ శరీరం కనుక అడిగే హక్కు నాకు లేదనుకో. ఐనా నేను యీ బజారురకంకన్నా తీసిపోలేదు కదా?"

దాసు మెల్లిగా తలెత్తి అన్నాడు; "కూర్చో శ్యామా! చెప్తాను. నా అభిరుచులు: ఇంత కిందికి దిగిపొయ్యేందుకు కారణంవుంది. మనం అనుకున్నట్టు జరక్కుండా, పరిస్థితులు తమ ఇష్టంవొచ్చినట్టు మనమీద స్వారీ చేస్తున్నయ్. అందరిలాగే మొదట

నావీ గొప్పరుచులే! కాని ఎప్పటినుంచీ వాటితో ఓటమిని ఎదుర్కోసాగానో- అప్పటినుంచీ తప్పనిసరిగా ఆ రుచుల్ని కూడా ఒక్కో మెట్టే దింపుకోసాగాను. ఆ విధంగా అవ్వి బజారు రకం దగ్గర జయంపొంది నిలబడిపోవాల్సి వొచ్చింది. అంతకన్న ఇంకా కిందికి పోనందుకు నాకు చాలా సంతోషంగా కూడా ఉంది... ఇక నీ విషయంలో... నువ్వు గొప్ప రుచులు గలదానివి. నా రుచులు కూడా ఇంకా గొప్పగానే ఉన్నయ్యని భ్రమించావ్... గొప్పింటి కోడలివి. నేను ప్రేమించి, పూజించిన యువతివి-"

"అందుకనే-" అంది ఆమె రోషంతో.

"విను. అందుకనే ఇంత తక్కువ రుచులకు క్రమంగా అలవాటు పడిపోయిన నేను- నీ అంత గొప్పదాన్ని పొందే అర్హతకు దూరమయ్యాను. నిన్ను కానీ నీ అభిరుచుల్నికానీ నేను కలుషితం చెయ్యదల్చలేదు. ఇద్దరి అభిరుచుల్లోనూ యేర్పడ్డ యీ భేదం భరించరానిది! అదీ కాక, అప్పటికి నా సంగతి నీకింకా పూర్తిగా తెలియదు. నువ్వు ఆనాడు అంత ధైర్యంగా మనసువిప్పి మాట్లాడావంటే ఆ విషయాల లోతులు నీకు తెలియక పోవటం వల్లనే! ఒక్కటి ఆలోచించు; ఈ క్షణిక సుఖంకోసం ఇలా మంచం పట్టేందుకు నువ్వు ఒప్పుకుంటావా?"

తలదించేసి నేలవేపు చూస్తూ మళ్ళీ అన్నాడు: "ఒకవేళ నువ్వు ఒప్పుకున్నా... అందుకు నేను ఒప్పుకోగలనా? ఆలోచించు శ్యామా!"

తలెత్తి చూశాడు. శామల కూర్చున్న కుర్చీ ఖాళీగా వుంది.

- అక్టోబరు, *1944*